క్లుప్తంగా

మందుగుండు విక్రయాలపై దాడులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగిలో మందుగుండు విక్రయాలు చేపడుతున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి. కళాధర్ తెలిపారు. వీరి నుంచి రూ.16,880 విలువ గల సామగ్రి సీజ్ చేసినట్లు చెప్పారు.

తహసీల్దార్ పరిశీలన



గుమ్మలక్ష్మీపురంలో సర్వే చేస్తున్న తహసీల్దార్ అప్పారావు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంతో పాటు ఎల్విన్‌పేట గ్రామంలోని ఈనాం భూములను తహసీల్దారు ఎస్.అప్పారావు శనివారం పరిశీలించారు. అలాగే 2003కు ముందు ఇచ్చిన డీ–పట్టాలు ఫ్రీ హోల్డ్ అయినదీ లేనిదీ గమనించారు. ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్ సర్వేలో భాగంగా ఆ భూములను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆయన వెంట వీఆర్‌వో బి.హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: ఇటీవల సీతంపేటలో జరిగిన అండర్ 17, 14 పాఠశాల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీల్లో మండలంలోని ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం బెజ్జిపురపు సంఘం నాయుడు, తదితరులు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ రాకోటి రాములు, విద్యార్థులు జి.శేఖర్, యు.దీపిక, ఎ.విజయలక్ష్మి, ఎస్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించండి



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆధునిక వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ సూచించారు. కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో మండల వ్యవసాయాధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడంతో పాటు వారితో క్షేత్ర సందర్శన శనివారం చేపట్టారు. వ్యవసాయ పంటలు, ఉద్యానవనాల సాగులో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన సాగు నూతన విధానాలను ఆయన వివరించారు. ప్రతీ రైతు లాభపడేలా వారిని చైతన్యం చేయాలన్నారు. అనంతరం కేవీకేలో ఏర్పాటు చేసిన డెమో యూనిట్ల(సాగులో ఉన్న పలు పంటలు)ను సందర్శించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: వరి చేనులో ఆశించిన రసం పీల్చు పురుగులు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమిసంహారక మందులు వాడాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. లక్ష్మీపురం, వెంకటాపురం,సూరంపేట గ్రామాల్లో వరి చేను పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వరిచేను పంటేపుగా పెరుగుతున్న సమయంలో ఆశించిన పీల్చుపురుగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముందుగా రసం పీల్చు పురుగులు ఉధృతిని తగ్గించడానికి యల్లోస్టికీ కార్డ్స్ ఉపయోగించాలని తరువాత రసాయనాలు వాడాలని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్‌ఎఫ్) శాఖ ఆధ్వర్యంలో ఎల్లోస్టికీకార్డ్స్ రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. రసాయనాలు వినియోగించే ముందు వరిచేనులో తెగుళ్లను వ్యవసాయ సిబ్బంది పరిశీలించిన తరువాతనే మందు ద్రావణాన్ని పిచికారీ చేయించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో ఏఓ పర్యవేక్షణలో మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

పాడి ఇంట పసిడి పంట..

- మేలు జాతి పశువులతో పాల దిగుబడి
- కృత్రిమ గర్భధారణతో పాడివృద్ధి



కృత్రిమ గర్భధారణతో జన్మించిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పాడిపంటలు వ్యవసాయ కుటుంబాలకు రెండు కళ్లు వంటివి. ప్రకృతి వైపరిత్యాలు, ధరల పతనం, మార్కెట్ మోసాలతో అప్పుడప్పుడు రైతులు వ్యవసాయంలో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో పాడిపశువులు రైతులను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. పంటల సాగుకు ఏడాదంతా పెట్టుబడులు పెట్టాలి. ఒకవేళ ప్రకృతి అనుకూలించకపోతే పెట్టిన పెట్టుబడి అంతా కోల్పోవాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు పాడి పశువులు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటి పోషణ, మేలు జాతి పశువుల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకుంటే పాడి ఇంట పసిడి పంట పండుతుందని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో నిరుద్యోగులు, కూలీలు కూడా పాడి పరిశ్రమపై ఆధారపడుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 30 శాతం మంది పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలో 68,471 ఆవులు, గేదెలున్నాయి. వీటి ద్వారా వస్తున్న పాలతో రోజుకు రూ.57 లక్షల మేర ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు ఓ అంచనా. పాడి పరిశ్రమ ఇంకా వృద్ధి చెందాలంటే మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాలని పశుసంవర్థక శాఖాధికారులు సూచిస్తున్నారు.

ఈతల మధ్య నిడివి తగ్గించుకోవాలి..

పాడి పశువులు ఎక్కువకాలం పాలిచ్చేలా చూసుకోవాలి. ఈనిన 60 రోజుల నుంచి 90 రోజుల మధ్య ఎదకు వచ్చేలా చూసుకోవాలి. మొదటి సారి ఎదకు వచ్చినప్పుడే చూడి కట్టించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన మేలు జాతి పశు వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాలి. అప్పుడే సంకరజాతి పశువుల ఉత్పత్తితో పాడిపరిశ్రమ వృద్ధి చెంది అధిక పాల దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. సంకరజాతి పశువులు 18 మాసాలకే ఎదకు వస్తాయి. దేశవాళీ పశువులైతే మూడేళ్ల వరకు ఎదకు రావు. దేశవాళీ ఆవులు, గేదెలు ఈత అనంతరం రెండు వందల రోజులు పాలు ఇస్తాయి. సంకరజాతి ఆవులు, గేదెలు ఈనిన తర్వాత 350 రోజులు పాలు ఇస్తాయి.

ఉత్తమ జాతులే మేలు...

పాడి పరిశ్రమలో అధిక లాభాలు పొందాలంటే ఉత్తమ జాతులను ఎంచుకోవాలి. అధిక పాలనిచ్చే మేలు జాతి ముర్రా గేదె, సంకరజాతి ఆవులను పోషించాలి. రోజుకు 12 లీటర్లకు తక్కువ లేకుండా పాలిచ్చే ఆవులు, గేదెలు ఉండాలి. వాటికి సమతుల్య ఆహారం అందించాలి. నీరు, నీడ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి.

వ్యాధులపై అప్రమత్తం..

పశువులకు అన్ని సీజన్‌లలోనూ అంటు వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రధానంగా ఏలికపాములు, జీర్ణకోశంలో నట్టలు, రక్తంలో ఏక కణజీవులు, పిరుదుల వాపు, క్షయ, ఎండు వ్యాధి రోగాలు వచ్చే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి, పారుడు రోగం, గొంతువాపు, పొదుగువాపు వ్యాధులు కూడా వస్తాయి. వ్యాధులు సోకకుండా పశువులను ఎప్పటికపుడు శుభ్రం చేస్తుండాలి. పశువుల ఆరోగ్యంలో తేడా వస్తే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలి.

వైద్యుల సూచనలు పాటించాలి..



పాడి రైతులు ముఖ్యంగా వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి. మూగ జీవాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక పశు వైద్యులను సంప్రదించాలి. పాడి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకం ప్రవేశపెట్టింది. అవకాశాలను సద్వినియోగం చేసుకుని పాడి రైతులు వృద్ధి సాధించాలి. అలాగే పశువులకు బీమా చేయించుకుంటే భరోసా ఉంటుంది.

– ప్రభా మాణిక్యరావు, పశుసంవర్థక శాఖ ఎ.డి, పాలకొండ

ఏజెన్సీలో వర్షం



వీరఘట్టం: భారీ వర్షంతో కొత్త బస్టాండ్‌లో రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు



సీతంపేట: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం



భామిని: మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం

ఏజెన్సీ ప్రాంతాలైన వీరఘట్టం, సీతంపేట, భామిని, పాలకొండ మండలాల్లో పలుచోట్ల శనివారం భారీ వర్షం కురిసింది. గంటల తరబడి వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

అభినందనలు



పరీక్షిత్‌రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలుపుతున్న వైస్ ఎంపీపీ శరత్‌బాబు

కొమరాడ/జియ్యమ్మవలస: వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా శత్రుచర్ల పరీక్షిత్‌రాజు రెండోసారి ఎన్నికైన నేపథ్యంలో పార్టీ శ్రేణుల నుంచి ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి కోటలో ఆయనను కొమరాడ మండల వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు శనివారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి, ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని పరీక్షిత్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో తొడుము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలం, కళ్లికోట సర్పంచ్ దత్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బొంగు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ బొంగు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తమ గ్రామ మహిళా సంఘాల తరఫున రావాల్సిన ఇసుక డబ్బులు వచ్చేలా చూడాలని బిత్రపాడు సర్పంచ్ కోరారు. రావాడ వట్టిగెడ్డ నీరు అందకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయని, కాలువల్లో సిల్ట్ తీయించాలని వైస్ ఎంపీపీ సంపత్ అభ్యర్థించారు. వీవోఏల అక్రమ తొలగింపులు అడ్డుకోవాలని జెడ్పీటీసీ శశికళ విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మండలానికి వచ్చే నిధులను అభివృద్ధికి వినియోగించేలా అందరూ సహకరించాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశంలోనే కాకుండా నెలలో రెండుసార్లు ఎంపీటీసీ సభ్యులంతా సమావేశమై, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రణాళికలు రచించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ : నగర పంచాయతీ ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 1,2,20 వార్డుల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇదే సమయంలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సచివాలయ, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్ ప్రతినిధి గంటా సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

భామిని: మండలంలోని బాలేరులో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో చెత్త తరలింపు పనులు శనివారం చేపట్టారు. అలాగే కాలువల్లో పూడికలు కూడా తీశారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొమరాడ: స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. సీహెచ్ రోహిత్, కె.పవన్, కె.అభిషేక్, పి.ప్రభుకుమార్, పి.భరత్ తదితరులు ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

పరిశుభ్రత పాటించాలి



వీరఘట్టం : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు

- ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ వై. వెంకటరమణ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వీరఘట్టం కొత్త బస్టాండ్‌లో ఉన్న టిఫిన్ దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంటలకు నాణ్యమైన సరుకులు వినియోగించాలని సూచించారు. అనంతరం పంచాయతీ, సచివాలయ సిబ్బందితో కలసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన..

పాలకొండ: మండలంలోని కొండాపురంలో సర్పంచ్ రాయి వనజ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చెత్తను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుండీల్లో వేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకర సమాజం నెలకొంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ రోడ్డులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కిశోర్, గ్రామ సచివాలయ ఉద్యోగులు కలిసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.



గుమ్మలక్ష్మీపురం: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పాలకొండ: ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

మహాకవి గురజాడ..

పాలకొండ రూరల్: గురజాడ అప్పారావు మహాకవి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి అన్నారు. కళాశాల ఆవరణలో గురజాడ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ, గురజాడ తన రచనలతో సమాజాన్ని జాగృత పరిచారన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించే క్రమంలో ఆయన రచనలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్.కుమారి, బి.రాజు, కె.శ్రీనివాసరావు, ఎం.శాంతి, రాఘవేంద్ర నాయుడు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ వేంకటఅప్పారావు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎన్.మధుసూదనరావు, తదితరులు కలిసి గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కన్యాశుల్కం, బాల్యవివాహాలు వంటి దురాచారాలను రూపుమాపేందుకు గురజాడ ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలు శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జి.చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ వేంకటఅప్పారావు జయంతి శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం మాట్లాడుతూ గురజాడ గొప్ప సంఘసంస్కర్త అని, ఎన్నో సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషి చేశారని తెలిపారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, గ్రామ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.



గరుగుబిల్లి: గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మధుసూదనరావు



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి కార్యక్రమం



గురజాడ విశిష్టతను వివరిస్తున్న వైస్ ప్రిన్స్‌పాల్ జయమణి

హమ్మయ్య.. యాప్ పనిచేసింది



ఇసుక లారీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శేఖరం, సిబ్బంది

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక యాప్ ఎట్టకేలకు ఓపెన్ అయ్యింది. మండలంలోని కాట్రగడ–బి వద్ద ప్రభుత్వ ఇసుక స్టాక్‌యార్డ్ నుంచి శనివారం మూడు వాహనాలతో ఇసుక తరలించారు. తహసీల్దార్ నిమ్మల శేఖరం ఆధ్వర్యంలో ఇసుక వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌కుమార్, ఆర్ఐ ఎస్.రాంబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బల్లంకివీధిలో అన్నదానం



గరుగుబిల్లి: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



పాలకొండ రూరల్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని బల్లంకి వీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. వినాయక కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులంతా స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం వంటి పూజలు చేశారు.

బార్నాలవీధిలో..

వీరఘట్టం: మండల కేంద్రంలోని బార్నాలవీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదానానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గోతుల పూడ్చివేత



గుంతలను పూడ్చి వేయిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్...

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం రహదారిలో ఏర్పడిన గోతులను పోలీసులు దగ్గరుండి మరీ పూడ్చి వేయించారు. గోతుల వల్ల జరుగుతున్న ప్రమాదాలపై ఇటీవల సాక్షిలో 'ప్రమాదకరంగా మారిన గుంతలు' పేరిట కథనం ప్రచురితమైంది. దీంతో పోలీసులు స్పందించి శనివారం స్థానిక ఇటుకల వ్యాపారి పి. వెంకటరమణ సహకారంతో గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో ఎస్సై ప్రయోగమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గురండిలో 'పొలంబడి'



వరి పొలంలో క్షేత్ర పరిశీలన చేస్తున్న ఏఓ సింహాచలం, రైతులు

భామిని: మండలంలోని గురండిలో శనివారం జీపీపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కె.సింహాచలం రైతులతో కలిసి వరి పైరును క్షేత్రస్థాయిలో పరిశీలించి చీడపీడలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి పంటకు రెండో దఫా ఎరువుగా 25 కిలోల యూరియా వేయాలని సూచించారు. ప్రస్తుతం పైరుకు ఆకుముడత, పాముపొడ తెగులు ఆశిస్తోందని, వీటి నివారణకు లీటర్ నీటిలో రెండు గ్రాముల కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్, 2 ఎంఎల్ హెక్సాకొనజోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పొలంబడి ఫీల్డ్ ఆఫీసర్ కె. ఈశ్వర్, ఆడిటర్ ఎస్.దినేష్, వీఏఏ నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

పాలకొండ రూరల్: భగవాన్ విశ్వకర్మ విరాట్ పురుషుని శోభాయాత్ర శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నపూర్ణ సమేత సనారీ విశ్వేశ్వర అవధూత స్వామివారి దివ్యజ్ఞాన మండపంలో ఐదు రోజుల పాటు భక్తులచే విశేష పూజలు, హోమాది కార్యక్రమాలు అందుకున్న స్వామిని ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.